



	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	38	25
భద్రాద్రి	42	28

మతోన్మాద బీజేపీని ఓడించడమే లక్ష్యం

- అందుకే 'ఇండియా' కూటమితో జట్టు కట్టాం
- ముదిగొండలో సీపీఎం శ్రేణులపై కాల్పులు జరిపింది కాంగ్రెస్ ప్రభుత్వమే..
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



మాట్లాడుతున్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఏప్రిల్ 13: 'కేరళలో సీపీఎంను ఓడించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది.. ఉమ్మడి రాష్ట్రంలో ముదిగొండలో సీపీఎం నాయకులపై కాల్పులు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమే.. అసెంబ్లీ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సీట్లు సర్దుబాటు కాలేదు...' ఇలా రాజకీయంగా అనేక విభేదాలున్నా మతోన్మాద బీజేపీని ఓడించేందుకు ఇండియా కూటమిలో సీపీఎం భాగస్వామ్యమైందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు తెలిపారు. ఖమ్మం జిల్లా సీపీఎం కార్యాలయంలో శనివారం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా ప్లీనంలో రాఘవులు మాట్లాడారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి ఓటమి భయం పట్టుకొందన్నారు. కానీ దేశ, విదేశాల్లోని కార్పొరేట్ మీడియాతో మాత్రం తామే గెలవబోతున్నట్లు గోబెల్స్ ప్రచారం చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఇండియా కూటమి తొలి మూడు సమావేశాల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు సర్దుబాటు కాకపోవటం వల్లనే బీజేపీ గెలిచిందని, కానీ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మంచి అవగాహనతో ఇండియా కూటమి ముందుకు వెళ్లి విజయం సాధిస్తుందన్నారు. ఓటమి భయంతోనే ఇండియా కూటమిలోని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ లాంటి వారిపై ఈడీ, సీబీఐ కేసులు బనాయించి జైలుకు పంపారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగ మూలసూత్రాలను మారుస్తారని ఆరోపించారు. ప్రస్తుతం సంపూర్ణ మెజారిటీ లేకపోవడం వల్లనే ఆ పార్టీ తన మతోన్మాదాన్ని బయటకు తీయలేదన్నారు. రాజ్యాంగ మూలసూత్రాలను కాపాడుకోవాలంటే ప్రజలు బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని రాఘవులు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సీపీఎం పోరాటం ఫలితంగానే ఎలక్టోరల్ బాండ్లపై కోర్టుతీర్పుతో ఆయా బాండ్లు రద్దయ్యాయన్నారు. కేరళలో సీపీఎం గ్రామశాఖలో రూ.కోటికి లెక్కలు చూపలేదని రూ.16కోట్లు జరిమానా నోటీసులు జారీ చేశారన్నారు. దీనిపై కోర్టు స్టే ఇచ్చిందన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, బొంతు రాంబాబు, వై. విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వర్లు, చింతలచెర్వు కోటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, మాచర్ల భారతి, భూక్య వీరభద్రం పాల్గొన్నారు.

'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ 6



బలమూ.. బలగమూ...

- అందుకే ఈ సీటుకు ఇంత గిరాకీ
- 17సార్లు జరిగిన ఎన్నికల్లో 11సార్లు కాంగ్రెస్‌దే విజయం
- సత్తాచాటిన లోకల్, నాన్ లోకల్ నాయకులు
- గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల హవా
- భారీ మెజారిటీలతో బలపడిన ఓటు బ్యాంకు
- డిప్యూటీ సీఎం, ఇద్దరు మంత్రులు ఉండటంతో పార్టీ శ్రేణుల్లో సమరోత్సాహం
- గెలుపు ఖాయం కావడంతో టికెట్ కోసం పోటాపోటీ

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం ఆది నుంచీ కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలుస్తూ వస్తోంది. కాంగ్రెస్ ఓటు బ్యాంకు బలానికి ఇప్పుడు శక్తివంతమైన బలగం కూడా తోడయ్యింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరోవైపు రాజ్యసభ సభ్యురాలు, కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి... ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధి నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్‌లో కీలకపాత్ర పోషిస్తున్న నేతలంతా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోనే ఉండడం, వివిధ స్థాయిల్లో సంస్థాగతంగా కేడర్ పటిష్ఠంగా ఉండడం, గత అసెంబ్లీ ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ నుంచి తుమ్మల వర్గం, పొంగులేటి వర్గం కాంగ్రెస్ గూటికి రావడం.. కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా మార్చాయి. లోకల్ అయినా, నాన్‌లోకల్ అయినా బరిలోకి దిగితే చాలు, విజయం ఖాయమనే పరిస్థితులు ఉండటం ఒక్క ఖమ్మం లోక్‌సభ స్థానానికే చెల్లింది.

ఖమ్మం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో పార్టీ పటిష్ఠంగా ఉండటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా టికెట్‌కు డిమాండ్ ఏర్పడింది. పలువురు నేతలు ఎవరి స్థాయిలో వారు ప్రయత్నాలు సాగిస్తున్నారు, జిల్లా, రాష్ట్ర నేతలు, ఇతర జిల్లాల నేతలు కూడా టికెట్ రేసులో చివరి ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇటు మంత్రుల కుటుంబాల నుంచి ముందు బలమైన ఆశలు పెట్టుకున్నా ఆ తర్వాత పార్టీ నిర్ణయానికే వదిలేశారు. జిల్లా ఆశావరులు కూడా మంత్రుల బంధుగణానికి టికెట్ ఇవ్వని పక్షంలో తమకు ఇవ్వాలని ఒత్తిళ్లు తెస్తున్నారు. స్థానిక, స్థానికేతరుల పేర్లు ప్రచారంలోకి వస్తున్నాయి. అయితే ముఖ్యమంత్రి నిర్ణయమే అంతిమ నిర్ణయంగా కనిపిస్తుంది. ఖమ్మం టికెట్ ఇస్తే గెలుపు గ్యారంటీ అన్న భావన ఉండడంతో అందరి దృష్టి ఖమ్మంపైనే ఉంది. ఢిల్లీ అధిష్ఠానం కూడా ఖమ్మం టికెట్ విషయంలో ఆచి తూచి వ్యవహరిస్తోంది. ఖమ్మం లోక్‌సభకు ఇప్పటివరకు 17సార్లు ఎన్నికలు జరగ్గా 11సార్లు కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. రెండుసార్లు పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థులు, ఒక్కసారి చొప్పున సీపీఎం, టీడీపీ, వైసీపీ, బీఆర్‌ఎస్‌లు గెలుపొందాయి.

ఉమ్మడి రాష్ట్రంలో స్థానికేతరులకే అవకాశం

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ఇప్పటివరకు స్థానికుల కంటే స్థానికేతరులే ఎక్కువసార్లు విజయం సాధించారు రాష్ట్రస్థాయిలో ఆయా పార్టీలకు చెందిన నాయకులకు ఖమ్మం టికెట్ కేటాయించడంతో స్థానికేతరులు టికెట్ సాధించిన సందర్భాలు అనేకం. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గానికి మొదటిసారి జరిగిన ఎన్నికల్లో పీపుల్స్ డెమోక్రటిక్ ఫ్రంట్ నుంచి 1952-57లో గెలిచిన పీవీ విఠల్ స్థానికేతరుడే. అలాగే 1967,71లో ఖమ్మం కాంగ్రెస్ నుంచి గెలిచిన తేళ్ల లక్ష్మీకాంతమ్మ కూడా స్థానికేతరురాలే. ఈమె ఖమ్మం నుంచి హ్యాట్రిక్ సృష్టించారు. ఆ తర్వాత 1991లో పీవీ రంగయ్యనాయుడు, 1998లో నాదెండ్ల భాస్కరరావు 1999, 2004లో గెలిచిన రేణుకాచౌదరి స్థానికేతరులే. ఖమ్మం జిల్లాకు చెందిన వారిలో కాంగ్రెస్ నుంచి 1977, 80లో జలగం కొండలరావు, 1984, 1989లో జలగం వెంగళరావు గెలుపొందారు. వీరు కూడా కృష్ణా జిల్లా నుంచి పెనుబల్లికి వలస వచ్చిన వారే. సీపీఎం నుంచి 1996లో గెలుపొందిన తమ్మినేని వీరభద్రం, టీడీపీ నుంచి 2009, 2019లో టీఆర్‌ఎస్ నుంచి గెలిచిన నామా నాగేశ్వరరావు, 2014లో ఖమ్మం వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా వాసులు. ఖమ్మం లోక్‌సభను ఎక్కువసార్లు స్థానికేతరులే కైవసం చేసుకున్నారు.

ఈ సారి టికెట్‌కు డిమాండ్

గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, సీపీఐ కూటమి గెలిచాయి. కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు కాంగ్రెస్ మద్దతుతో గెలవగా, మిగిలిన నియోజకవర్గాలన్నీ కాంగ్రెస్ పార్టీ చేతిలోనే ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు

ఆది నుంచీ ఖమ్మంలో కాంగ్రెస్‌దే హవా

అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీలు లభించాయి. ఖమ్మం లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థులకు 2,66,162 ఓట్ల ఆధిక్యత లభించింది. మొత్తం ఏడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులకు 7,33,293 ఓట్లు రాగా, బీఆర్‌ఎస్ అభ్యర్థులకు 4,67,631 ఓట్లు లభించాయి. మహబూబాబాద్ నియోజకవర్గం పరిధిలో భద్రాచలం, ఇల్లెందు పినపాక నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 2,42,214 ఓట్ల లభించగా బీఆర్‌ఎస్‌కు 1,61,118 ఓట్లు లభించాయి. ఈ మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు 86,096 ఓట్ల ఆధిక్యత లభించింది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావుకు 5,67,459 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థి రేణుకాచౌదరికి 3,99,397 ఓట్లు వచ్చాయి. నామాకు 1,68,062 ఓట్లు మెజారిటీ లభించింది. గత లోక్‌సభ ఎన్నికలకు ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోల్చుకుంటే కాంగ్రెస్ పార్టీ అదనంగా 3,33,296 ఓట్లు లభించగా, టీఆర్‌ఎస్‌కు 2,65,662 ఓట్లు కోల్పోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించడంతో ఖమ్మం లోక్‌సభ నుంచి పోటీ చేస్తే విజయం ఖాయమని కాంగ్రెస్ టికెట్ ఆశావరుల్లో నెలకొంది.




కొత్తగూడెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

అభ్యర్థి ఎవరైనా గెలిపించాలి

- రెండుమూడురోజుల్లో ఖమ్మం అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కొత్తగూడెంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

7



మున్నేరు రక్షణ గోడల మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

పటిష్ఠంగా మున్నేరు రక్షణ గోడలు

- పర్యాటకంగా కూడా ఏర్పాట్లు చేయాలి
- నీరు నిల్వ ఉండేలా వాగులో చెక్‌డ్యామ్‌లు నిర్మించాలి
- నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

6

నేడైనా కొలిక్కి వచ్చేనా!?



- ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిపై నేడు హైదరాబాద్‌లో సమావేశం
- పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ రాక

ఖమ్మం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ దగ్గరపడుతుండటంతో పెండింగ్‌లో ఉన్న ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై కాంగ్రెస్ అధిష్ఠానం మళ్లీ కసరత్తు ముమ్మరం చేసింది. రాష్ట్ర స్థాయిలో పరిస్థితిని అంచనా వేసి అభ్యర్థిని నిర్ణయించేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఆదివారం హైదరాబాద్ రాబోతున్నారు. ఈ సమావేశంలో ముఖ్య నేతలతో చర్చించి ఖమ్మం టికెట్‌పై ఏదో ఒక నిర్ణయం తీసుకోవచ్చని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఆదివారం సమావేశంతో ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి కొలిక్కి వస్తుందా... మరికొన్ని రోజులు జాప్యం జరుగుతుందా... అని పార్టీలో మరికొందరు పేర్కొంటున్నారు. ఇటు పీసీసీ, అటు ఏఐసీసీల్లో అనేక సమావేశాలు జరిగినా అభ్యర్థి ఎంపిక జరగలేదు. ముగ్గురు మంత్రుల బంధువులతో పాటు పలువురు ఆశావహులు రేసులో ఉండటంతో ఎవరికి టికెట్ ఇవ్వాలో తేల్చుకోలేని పరిస్థితి ఏర్పడింది.

మంత్రి పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, వియ్యంకుడు రఘురామరెడ్డి, మంత్రి తుమ్మల కుమారుడు యుగంధర్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని టికెట్ రేసులో ఉండగా, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, రాష్ట్ర గ్రానైట్ అసోసియేషన్ నాయకుడు రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు. మరో వైపు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్, ప్రయత్నాల్లో ఉండగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ పేర్లు తెరమీదకు వచ్చాయి. ఆదివారం జరిగే సమావేశంతో ఈ ఉత్కంఠకు తెరపడుతుందేమో చూడాలి.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ జడ్పీటీసీ ప్రియాంక



రఘునాథపాలెం, ఏప్రిల్ 13: రఘునాథపాలెం జడ్పీటీసీ సభ్యురాలు మాలోత్ ప్రియాంక కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి జడ్పీటీసీగా గెలుపొందిన ప్రియాంక కాంగ్రెస్‌లో చేరారు. శనివారం రఘునాథపాలెం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ జడ్పీటీసీ ప్రియాంకకు కాంగ్రెస్ కండువా కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ అభివృద్ధి కోసమే పార్టీ మారుతున్నానని, నాపై ఎవరి ఒత్తిడి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్య గౌరి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు జావీద్, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మలీదు జగన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ నేత, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఖమ్మం ఖిల్లాపై కమలం జెండా

- తాండ్ర వినోద్‌రావు గెలుపు ఖాయం
- బీజేపీకి కార్యకర్తలే దేవుళ్లు
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో కమలం జెండా ఎగరేస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో శనివారం రాత్రి ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా కార్యకర్తలు హాజరయ్యారు.

- ఖమ్మం బైపాస్ రోడ్

6

రేపటిలోగా ఏర్పాట్లు పూర్తిచేయాలి

ఉచిత తలంబ్రాల పంపిణీకి 60 కేంద్రాలు : భద్రాద్రి కలెక్టర్



ఈవోతో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాచలం, ఏప్రిల్ 13: భద్రాచల శ్రీసీతారామ చంద్రస్వామి కల్యాణం జరిగే మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను సోమవారం ఉదయానికి పూర్తి చేయాలని భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. కల్యాణ మహోత్సవానికి సంబంధించి ఆలయం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను శనివారం అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్యాణం తిలకించడానికి వచ్చే భక్తుల కోసం ముఖ్యమైన ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, రూట్‌మ్యాప్‌లు ఏర్పాటు చేయాలని, సెక్టార్ల ప్రత్యేక అధికారులు ఉదయం 8గంటల వరకే అక్కడికి చేరుకోవాలని ఆదేశించారు. ప్రతి సెక్టారు వద్ద ఇద్దరు శానిటేషన్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, వాహనాల పార్కింగ్, వీవీఐపీలకు, ప్రజలకు వేర్వేరుగా ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు మంచినీరు, టాయిలెట్లు, మెడికల్‌కు సంబంధించి ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. గోదావరి నది వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఉచిత తలంబ్రాల కౌంటర్లు 60, ప్రసాదాల కౌంటర్లు 19 ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో రమాదేవి, ఆర్డీవో, డీఆర్‌డీవో విద్యాచందన, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, డీఎంహెచ్‌వో పాల్గొన్నారు.

రామయ్య ఆరాధనలో పంచపాత్రలు 6

జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు



మాట్లాడుతున్న ఎంపీ నామా

ముదిగొండ, ఏప్రిల్ 13: ఖమ్మంజిల్లా సమగ్రాభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం ముదిగొండ మండల ముఖ్యకార్యకర్తల విస్తృత సమావేశం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి తనను గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ బీజేపీ పాలకులు తమకు వ్యతిరేకంగా మాట్లాడేవారిపై ఈడీ, సీబీఐతో దాడులు చేయిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీజేపీ నాయకుల వేధింపులకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. నామా నాగేశ్వరరావు పార్లమెంట్‌లో ఉంటే మహిళా, బీసీ రిజర్వేషన్లు అమలు జరగడం ఖాయమని నామాను అత్యధిక మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, వాచేపల్లి లక్ష్మారెడ్డి, పోట్ల ప్రసాద్, మీగడ శ్రీనివాస్‌యాదవ్, బంకా మల్లయ్య, తోట ధర్మా, వీరారెడ్డి పాల్గొన్నారు.



రామయ్యకు సార్వభౌమ సేవ

భద్రాచలం, ఏప్రిల్ 13: వసంత ప్రయుక్త తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా భద్రాచలంలో శనివారం శ్రీసీతారామచంద్రస్వామికి సార్వభౌమ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారికి తిరువీధిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, అర్చకులు అమరవాది వెంకట్రామన్, పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

దేవుని ఆరాధనలో ఐదు పాత్రలు వినియోగిస్తారు. వాటికే పంచపాత్రలని పేరు. ఇందులో తీర్థంతోనే స్వామికి పరిపూర్ణమైన ఆరాధన చేస్తారు. అర్ఘ్యపాత్ర, పాద్యపాత్ర, ఆచమనీయపాత్ర, స్నానపాత్ర, శుద్ధోకపాత్రతో ఎలాగైతే ఆరాధన సమగ్రంగా ఉంటుందో అలాగే భద్రాద్రి రాముని ఆరాధలో కూడా ఇంత పరిపుష్టం కావడానికి ఆ ఐదుగురు మహాభక్తుల పాత్రలు పంచపాత్రలుగా ఈ క్షేత్రంలో ప్రకాశిస్తున్నాయి. ఆ ఐదుగురే భద్రమహర్షి, పోకల దమ్మక్క, భక్త రామదాసు, తానీషా, తూము నరసింహదాసు. వీరి వల్లే భద్రాద్రికి ప్రపంచవ్యాప్తంగా ఈ ఖ్యాతి చేకూరింది. భద్రాద్రి ఆలయాభివృద్ధిలో వీరి సేవలు అమూల్యమైనవి.



రామయ్య ఆరాధనలో పంచ పాత్రలు

భద్రాద్రి ఆలయ అభివృదిలో ఆ ఐదుగురి పాత్ర అమూల్యం



భద్రాచలం, ఏప్రిల్ 13: చిన్న తనం నుంచిరామభక్తుడై నారద మహర్షి ద్వారా రామతారక మంత్రాన్ని ఉపదేశంగా పొంది దండకారణ్యంలోరాముని సాక్షాత్కరం కోసం ఘోర తపస్సు చేశారు. ఆ తపస్సుకు మెచ్చిన స్వామి ఇక్కడ అపూర్వమైన రీతిలో ఇంతకు ముందు ఎక్కడా ఎప్పుడు కాని ధరించనటువంటి శంఖ, చక్ర ధనుర్బాణాలతో ఆవిర్భవించారు. దీనికి కారణం భ ద్రునికి ఏ కోరిక లేకపోవడం, రాముడు ఏదైనా వరం కోరుకోమని అనడంతో స్వామి నువ్వు ఏ రూపంలో నాకు సాక్షాత్కరం ఇచ్చావో అదే రూపంలో నా తదనంతరం భక్తులు తరించేందుకు అర్చామూర్తిగా ఉండమని కోరడంతో స్వామి భద్రుని శిరస్సుపై వెలిశారు. ఆ వర ఫలితంగానే నేడు స్వామిని మనం సేవించుకుంటున్నాం. తానే కొండగా మారి నేటికి భద్రాద్రి రామున్ని తన తలపై మోస్తూ ఈ ప్రాంతాన్ని భూవైకుంఠంగా మార్చారు. పంచపాత్రల్లో భద్రమహర్షిది ప్రథమస్థానం. భద్రాద్రి రాముని ఆరాధనలో అర్ఘ్య పా త్రగా భద్ర మహర్షిని పేర్కొనవచ్చు.

పాద్య పాత్రలో పోకల దమ్మక్క

భద్ర మహర్షి చాలాకాలం ఆరాధించిన తరువాత ఎందరో మహానుభావులు ఇంకెందరో మహనీయులు సేవించి తరించారు. వారి చరిత్ర మనకు అందుబాటులో లేదు. చరిత్రకు అందుబాటులో ఉన్నంత వరకు 16వ శతాబ్దంలో పుట్టలో ఉన్న రాముడిని పోకల దమ్మక్క చూడటం జరిగింది. ఆమె ప్రతి నిత్యం స్వామి వారికి అడవిలో లభించే ఫలాలను నైవేద్యంగా సమర్పించేది. ఈ క్రమంలో ఆమె రాముని పాదాలను కడిగేది. దీంతో పోకల దమ్మక్క పాద్య పాత్రగా నిలిచింది.

ఆచమనీయ పాత్రలో భక్తరామదాసు

ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన కంచర్ల గోపన్న పాల్వంచ పరగణాకు(హస్నాబాద్) తహసీల్దారుగా ఉన్న సమయంలో భద్రాద్రి రామాలయం నిర్మాణానికి ఆరు లక్ష లు వెచ్చించారు. ఇదే సమయంలో భద్రాద్రి రామునికి దప్పిక వేస్తే కీర్తనలనే అమృతాన్ని తాగించిన మహనీయుడు భక్తరామదాసు. ఆయన ఎన్నో అమూల్యమైన అజరామరమైన కీర్తనలను రచించి గానం చేసి తరించారు. వేద మంత్రాలు స్వామికి ఎంత ఆనందాన్ని ఇస్తాయో రామదాసు కీర్తనలకు సైతం స్వామి అంతగా ఆనందిస్తారు. అందుకే భక్తరామదాసు ఆచమనీయపాత్రగా నిలిచారు.

తానీషాది స్నానపాత్ర

భక్తరామదాసును బందీఖానాలో బంధించిన అనంతరం రామోజీ, లక్ష్మోజీలుగా రామలక్ష్మణులు వెళ్లి తానీషాకు దర్శనమివ్వడం, ఆరు లక్షల బంగారు రామమాడాలు ఇచ్చారు. దీంతో ఏ సంప్రదాయస్థుడైనా రాముని సాక్షాత్కరం పొందడంతో ఆయన శరీరమంతా పవిత్రమైంది. రాముని కటాక్షంతో పూర్తిగా స్నానం చేయబడి పూర్వజన్మ సుకృతం వలన చరి త్రలోనే ఎంతో ఘన కీర్తిని సాధించారు. దీంతో తానీషాది స్నానపాత్రగా నిలిచింది.

శుద్ధోకపాత్రలో తూము నరసింహదాసు

ఎన్నో ఒడిదుడుకులు ఉంటే సరి చేసి ఆలయాన్ని అభివృద్ధిపథంలో నడిపి రామదాసు ఆశయాలను నెరవేర్చారు. ఆగమ, వైష్ణవ సంప్రదాయాలను కొనసాగించి పది రకాల ఉత్సవాల సంకీర్తనలతో ఆరాధనలు జరిగేటట్లు చేశారు. కాబట్టే తూము నరసింహదాసు శుద్ధోకపాత్రగా నిలిచారు.

మార్పు సముచితమేనా?

- వైదిక ప్రక్రియలో మార్పు పట్ల సర్వత్రా చర్చ

భద్రాచలం, ఏప్రిల్ 13: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంతపక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల వైదిక ప్రక్రియలో మార్పులు చేయడం పట్ల సర్వత్రా చర్చ సాగుతోంది. 1960వ దశాబ్దం చివర్లో అధికారికంగా దేవాదాయ శాఖ పరిధిలోకి భద్రాద్రి దేవస్థానం వెళ్లింది. నాటి నుంచి కొనసాగుతున్న ప్రక్రియలో మార్పులు చేయడం అటు పలు వైదిక వర్గాల్లో భక్తుల్లో అంతర్గత చర్చ సాగుతోంది.

వసంతపక్ష బ్రహ్మోత్సవాల సమయంలో పాడ్యమి నాడు ఉగాదిని పురస్కరించుకొని దర్బారు సేవ, పంచాంగ శ్రవణం నిర్వహించేవారు. అయితే గత ఏడాది పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని పురస్కరించుకొని పాడ్యమి నుంచే దర్బారు సేవను నిలిపివేసి రామయ్య కల్యాణ మహోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ అంకురార్పణ సాధారణంగా పంచమి నుంచి ప్రారంభం కావాలి. అయితే ఆనాడు పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల సందర్భంగా ఈ మార్పు జరిగిందని వైదిక వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఈసారి దేవస్థానం ప్రచురించిన క్యాలెండర్లో పంచమి నాడే అంకురార్పణ అని ప్రకటించి ఆహ్వాన పత్రికలో పాడ్యమి నాడు అని ప్రస్తావించడం గమనార్హం. గతంలో కూడా ప్రచురించిన కరపత్రానికి భిన్నంగా సేవలు జరగడం పట్ల విమర్శలు వెల్లువెత్తాయి.

అయితే ఈసారి నూతన వాహన సేవలు నిర్వహిస్తామని ఇటీవల నిర్వహించిన పత్రిక విలేకర్ల సమావేశంలో దేవస్థానం వైదిక పెద్దలు పేర్కొన్నారు. కాగా బుధవారం చలువచప్పర వాహనంలో స్వామి వారికి తిరువీధి సేవ నిర్వహించారు. వాస్తవానికి నూతన వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహిస్తామని అధికార వర్గాలు ప్రకటించి మళ్లీ చలువ చప్పర వాహనంలోనే సేవలు నిర్వహించేందుకు సన్నద్ధం కావడంలో ఆంతర్యం ఏమిటని రామ భక్తులు ప్రశ్నిస్తున్నారు. ఉగాది పర్వదినాన దర్బారు సేవ నిర్వహించకపోవడం పట్ల సాక్షాత్తు దేవస్థానంలో విధులు నిర్వహించే వైదిక వర్గాలే అంతర్గతంగా చర్చించుకుంటున్నట్లు వినికిడి.


భద్రాచలం రాములోరి పెండ్లికి పాదయాత్రగా బయలుదేరిన రామభక్తులు

రామభక్తుల పాదయాత్ర

అశ్వారావుపేట, ఏప్రిల్ 13: ఏపీలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన శ్రీ రామ దండు కమిటీ ఆధ్వర్యంలో ఐదు వేలమందికి పైగా రామభక్తులు పాదయాత్రగా భద్రాచలం బయలుదేరారు. భద్రాచలం పాదయాత్రగా బయలుదేరిన వేలాదిమంది శ్రీరామభక్తులు శనివారం అశ్వారావుపేటకు చేరుకున్నారు. రామభక్తులు రాకతో అశ్వారావుపేట రహదారులన్ని జై శ్రీరామ్ నినాదాలు, జెండాలుతో నిండి పోయాయి. అశ్వారావుపేటకు చెందిన రామదండు కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర భక్తులకు ఘన స్వాగతం పలికారు. పాదయాత్రగా వచ్చిన భక్తులకు రామదండు ఆధ్వర్యంలో భోజనాలు, తాగునీటి బాటిల్స్, మజ్జిగను ఏర్పాటు చేశారు. మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మందులను అందజేసారు. పట్టణానికి చెందిన వందలాది మంది భక్తులు, యువకులు తరలివచ్చి భక్తులకు సౌకర్యాలను అందజేశారు.


రామభక్తులకు అశ్వారావుపేటలో భోజనాలు ఏర్పాటు చేసిన స్థానికులు

శ్రీవారు పెళ్లికొడుకాయనే..

- జమలాపురంలో ఐదో రోజుకు చేరుకున్న బ్రహ్మోత్సవాలు
- వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగ, పద్మావతీ దేవి అమ్మవార్లకు కల్యాణ కాంతులు

ఎర్రుపాలెం ఏప్రిల్ 13: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం ఐదో రోజుకు చేరుకున్నాయి. తెల్లవారుజామున శ్రీవారికి సుప్రభాతసేవ, ప్రాతకాల సహస్రార్చన, నిత్యకార్యక్రమాలు నిర్వహించారు. యాగశాలలో అవాహిత దేవతా హోమాలు, అనుష్ఠానములు, గోపూజ నిర్వహించారు. శనివారం కావటంచేత అర్చకులు ముత్యాల కవచ అలంకారంలో శ్రీవారి దర్శనం భక్తులకు కల్పించారు. అనంతరం శ్రీవారిని, అలివేలుమంగ, పద్మావతి దేవిలను పెండ్లికొడుకు, పెండ్లికుమార్తెలుగా అలంకరించారు. నిత్య కల్యాణ సోభితులైన దేవి, దేవరులని చూసేందుకు భక్తులు గంటలపాటు క్యూలైన్‌లలో వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థప్రసాదం, ఉచిత అన్నదాన వితరణ చేశారు. అనంతరం మంగళ వాయిద్యములు, మేళ తాళాలు, కోలాట నృత్యాల మధ్య శ్రీవారిని సూర్యప్రభ వాహనంపై గిరి ప్రదక్షిణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు విజయదేవశర్మ, రాజీవ్‌శర్మ, సుదర్శన్‌శర్మ, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


శ్రీవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేక దృశ్యం

పటిష్ఠంగా మున్నేరు రక్షణ గోడలు

- పర్యాటకంగా కూడా ఏర్పాట్లు చేయాలి
- నిర్మాణ సంస్థ ప్రతినిధులతో మంత్రి తుమ్మల సమీక్ష

ఖమ్మం,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మున్నేరు నదీ పరివాహక ప్రాంతంలో వర్షాకాలంలో వచ్చే వరద నివారణ కోసం ముంపు కాలనీలను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న సీసీ ప్రొడక్షన్ గోడలు నిర్మాణ పనులు చేపడుతున్న నిర్మాణ సంస్థల ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం భేటీ అయ్యారు. ఈసదర్భంగా ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలకు సంబంధించి ఇరువైపులా నిర్మిస్తున్న పనులు గురించి మంత్రి తుమ్మల కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. ఇరువైపులా ప్రజలను ఆహ్లాదపరిచేలా బోటింగ్ సదుపాయం కూడా ఏర్పాటు చేయాలని, భవిష్యత్‌లో వాల్ పెంచడానికి వీలుగా నిర్మాణం చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో ఎంత వరద వచ్చినా మురుగు కాలవల ద్వారా పట్టణంలో బ్యాక్ వాటర్ రాకుండా పటిష్ట డ్రెయినేజీ సదుపాయం ఏర్పాటు చేయాలని , ప్రకాష్‌నగర్ కింది ప్రాంతం వరకు ఎప్పుడు నీరు నిలవ ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని, అవసరమైతే చెక్‌డ్యాంల నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా చేయాలని తద్వారా ఖమ్మం పట్టణానికి తాగునీటి సమస్య తీరుతుందని సూచించారు. మున్నేరులో చెత్తపడేయకుండా రెయిలింగ్ ఏర్పాటు చేయాలని, వైకుంఠదామం వద్ద స్నానాలు చేయడానికి ప్రత్యేక ఏర్పాటు చేయాలని అవసరమైన చోట్ల మెట్లు నిర్మించాలని పనులుండాలని సూచించారు. ఈ రక్షణ గోడల నిర్మాణానికి భూసేకరణ సమస్య తలెత్తకుండా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కారానికి కృషిచేస్తానని నిర్మాణ సంస్థల ప్రతినిధులకు మత్రి తుమ్మల తెలిపారు. మున్నేరు రక్షణ గోడలతో ప్రజలకు అహ్లాదకర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.


నిన్నటి వరకు బోసిపోయినట్లు ఉన్న మిషన్ భగీరథ ఇన్‌టెక్‌వెల్


నేడు జలకళను సంతరించుకున్న మిషన్‌భగీరథ

దుమ్ముగూడేన్ని ముద్దాడిన గోదావరి జలాలు

- సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీరు విడుదల
- ఆనకట్ట వద్ద 48.5మీటర్లకు పెరిగిన నీటిమట్టం
- జూన్ వరకు మిషన్‌భగీరథకు డోకా లేనట్లే
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

అశ్వాపురం, ఏప్రిల్ 1:3 మండల పరిధిలోని కుమ్మరిగూడెం వద్ద ఉన్న దుమ్ముగూడెం ఆనకట్టను ఎగువన ఉన్న సమ్మక్క ప్రాజెక్ట్ జలాలు శనివారం చేరాయి. దీంతో ఇప్పటి వరకు 47మీటర్లు ఉన్న నీటి మట్టం ఆనకట్టవద్ద 48.5మీటర్లకు చేరింది. దీంతో ఉమ్మడి జిల్లాకు తాగునీరు అందించే మిషన్ భగీరథకు జూన్ వరకు ఎటువంటి ఆటంకం ఉండదని అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. 2019మేనెలలో తీవ్రమైన ఎండలతో ఎవరూ ఊహించని విధంగా సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి నీటి మట్టం పూర్తిగా పడిపోయింది. మిషన్ భగీరథ నీటిసరఫరా నిలిచిపోవటంతో పాటు మణుగూరు భారజల కర్మాగారంలో ఉత్పత్తి నిలిచిపోయి చరిత్రలో నిలిచింది. అప్పటి నుంచి ప్రతి ఏడాది వేసవిలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

ఈఏడాది 2019 నాటి పరిస్థితులు పునరావృతమయ్యే విధంగా ఉండటంతో మిషన్ భగీరథకు ఆటంకం లేకుండా యంత్రాల ద్వారా గోదావరి నుంచి పిల్లకాలువ తవ్వారు. ఈనేపథ్యంలో గ్రామీణ తాగునీటిసరఫరా ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఈనెల 8న మిషన్ భగీరథ ఇన్‌టెక్ వెల్‌ను సందర్శించి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పరిస్థితి తీవ్రరూపం దాల్చే అవకాశం ఉండటంతో వెంటనే ఎగువన ఉన్న సమ్మక్క సాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులను కోరటంతో వారు స్పందించారు. మొదటగా 300 క్యూసెక్కులు, అనంతరం 400క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని నిర్ణయించారు. నీటిని విడుదల చేయటంతో పూర్తి స్థాయిలో అవి దుమ్ముగూడెం ఆనకట్టను చేరుతున్నాయి. దీంతో ఆనకట్ట సమీపంలో ఉన్న హెవీవాటర్ ప్లాంట్ ఇన్‌టెక్, మిషన్ భగీరథ పథకాలకు నీటి ఎద్దడి ముప్పు తప్పింది.

'అలుపెరుగని పోరాటం' పుస్తకావిష్కరణ

ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం ఏప్రిల్ 13: ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకం భవిష్యత్ ప్రజా పోరాటాలకు దిక్సూచి లాంటిదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ. రాఘవులు తెలిపారు. ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తక ఆవిష్కరణ శనివారం ఖమ్మంలోని మంచికంటి హాల్‌లో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బీవీ రాఘవులు మాట్లాడుతూ ఇన్నేళ్ల తన పాలన ట్రయలర్ మాత్రమేనని పూర్తి సినిమా రాబోయే కాలంలో చూపిస్తానని మోదీ అంటున్నారని, పూర్తి సినిమా అంటే మరింత నిరంకుశంగా వ్యవహరించటమేనా అని ప్రశ్నించారు. ప్రబీర్ పుర్కాయస్థ రచించిన 'అలుపెరుగని పోరాటం' పుస్తకం భవిష్యత్ పోరాటాలకు దిక్సూచీ అన్నారు. ఈ పుస్తకంలో నాటి ఎమర్జెన్సీ రోజుల నుంచి ఇప్పటి వరకు గల పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను కళ్లకు కట్టినట్లు రచించటంతో పాటు ఈ పుస్తకం వర్తమాన పోరాటాలకు బాట వేసేలా ఉందన్నారు. ఈ పుస్తకాన్ని చదివితే దేశాన్ని పాలించే పార్టీలు మారాయే తప్ప నిరంకుశం ఎప్పటిలానే ఉందన్న సంగతి అర్థమవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రశ్నించే వారిపై 'ఉపా' లాంటి కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయ టం ద్వారా ఎవ్వరూ ఎదురుతిరగకుండా అణిచి వేస్తోందన్నారు. ఇప్పటికే 'వన్‌నేషన్ వన్‌ఎలక్షన్' నినాదం చేస్తున్న మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే తమకు అనుకూలమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటారన్నారు. నవతెలంగాణ సాహితి ఎడిటర్ కె.ఆనందచారి అధ్యక్షతన జరిగిన ఈ సభ లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, ప్రముఖ వైద్యుడు డాక్టర్ గోపీనాథ్, విద్యా, సాహితీవేత్త రవిమారుత్, ఆప్ నాయకుడు ఎస్. తిర్మల్, సీపీఐ ఎంఎల్ ఎన్డీ నాయకులు రాజేంద్రప్రసాద్, వీరు నాయక్, మాచర్ల భారతి, ఈ పుస్తకాన్ని తెలుగులోకి అనువదించిన బోడపట్ల రవీందర్ పాల్గొన్నారు.

రామాలయానికి ఎయిర్ కర్టెన్స్ బహూకరణ

భద్రాచలం, ఏప్రిల్ 13: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయానికి పట్టణానికి చెందిన విష్ణు మెడికల్స్‌కు చెందిన అనే చరిత్, వైష్ణవి, కిషోర్, మధుసూదన్‌రావు రూ.55వేల విలువైన ఎయిర్ కర్టెన్స్‌ను బహూకరించారు. శనివారం దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, నిరంజన్‌కుమార్, ముఖ్య అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు పాల్గొన్నారు. ఏపీలోని రాజమండ్రికి చెందిన పురాణపండ శ్రీనివాస్ శ్రీరామనవమి సందర్భంగా 30 వేల శ్రీరామరక్ష స్తోత్రమ్ పుస్తకాలను దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి అందజేశారు. వీటిని ఈ నెల 17న శ్రీరామనవమి నాడు భక్తులకు ఉచితంగా వితరణ చేయాలని దాత కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రావణ్‌కుమార్, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, వేద పండితులు లింగాల రామకృష్ణ ప్రసాద్, రామాయణ పారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు పాల్గొన్నారు. దేవస్థానం ఉచిత నిత్యన్నదాన సత్రానికి రూ.1,00,116లను భద్రాచలంలోని కూనవరం రోడ్డులో నివాసం ఉంటున్న బి.సూర్యనారాయణమూర్తి తులసి చంద్రభానులు అందజేశారు. దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబాకు వారు చెక్కును అందజేశారు.


ఎయిర్ కర్టెన్స్ అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధ్వజపట మండల లేఖనం నిర్వహించనున్నారు.

నగరంలో బీజేపీ అభ్యర్థి ప్రచారం


ప్రచారం చేస్తున్న తాండ్ర వినోదరావు

ఖమ్మంబైపాస్‌రోడ్, ఏప్రిల్ 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోదరావు, ఆయన సతీమణి వినీల రావుతో కలిసి బీజేపీ నాయుకలు నగరంలోని పలుప్రాంతాల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేల్పుల సుధాకర్, సన్నే ఉదయ్‌ప్రతాప్, వెంకటనారాయణయాదవ్, సాయిరాం, నాగేదర్, మధు, కళ్యాణ్, వీరు గౌడ్, అనిత, పాల్గొన్నారు.

ఖమ్మం ఖిల్లాపై కమలం జెండా

- బీజేపీకి కార్యకర్తలే దేవుళ్లు
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి

ఖమ్మం బైపాస్‌రోడ్, ఏప్రిల్ 13: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మంలో కమలం జెండా ఎగరేస్తామని కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. నగరంలోని బీజేపీ పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో శనివారం రాత్రి ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జ్ అభయ పాటిల్, కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌లో మాధవిలతతోపాటు ఖమ్మంలో వినోద్‌రావు కూడా బీజేపీ విజేతల జాబితాలో ఉంటారని అన్నారు. బూత్ కార్యకర్తలు పార్టీకి సేవ చేస్తున్నట్లు భావించకుండా కష్టపడి పనిచేయాలని హితువు పలికారు. ఇప్పుడు కష్టపడితే స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి అవకాశాలు వస్తాయని అన్నారు. ప్రజలకు కార్యకర్తలు ఎల్లప్పుడూ అండగా ఉండాలని, బీజేపీకి కార్యకర్తలే దేవుళ్లు అని అన్నారు. బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు మాట్లాడుతూ ప్రతీ కార్యకర్త మోదీ సైనికుడిగా పని చేసి మోదీ కోరుకున్న 400 సీట్లతో ఖమ్మం కూడా ఉండేలా కృషిచేయాలని సూచించారు. వచ్చే 30రోజులు ప్రతీ కార్యకర్త శ్రమించి తనను ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమింద్రరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రంగాకిరణ్, నంబూరి రామలింగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మార్తనేని ధర్మారావు, శ్రీకాంత్, శ్యామ్‌రాథోడ్ పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న కాటేపల్లి వెంకటరమణారెడ్డి

మధ్యాహ్నభోజనం మింగేశారు

- ఏడాదిగా విద్యార్థులకు అన్నంపెట్టకుండానే నిధులు డ్రా
- వంటమనిషి పేరున నకిలీ బిల్లులతో స్వాహా

గుండాల, ఏప్రిల్ 13: సర్కారు బడుల్లో డ్రాపౌట్లను తగ్గించి విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వ అమలు చేస్తున్న మధ్యాహ్నభోజన పథకాన్ని ఓ ఉపాధ్యాయుడు పక్కదారి పట్టించాడు. సంవత్సర కాలంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండానే వంట తయారుచేసే మహిళ పేరుపై నకిలీ బిల్లులతో ఎంచక్కా నిధులు డ్రా చేసుకున్నాడు. పాఠశాలకు రాకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సదరు ఉపాధ్యాయుడిపై గ్రామస్థుల ఫిర్యాదుతో ఎంఈవో చేసిన ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. భద్రాద్రి జిల్లా గుండాల మండలం నాగారం మండల పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గుగులోత్ శంకర్ విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాడు. ఎంఈవో పెండెకట్ల క్రిష్టయ్యకు శనివారం పాఠశాల ఆకస్మికంగా తనిఖీ చేశారు. అయితే ఉపాధ్యాయుడు శంకర్ పాఠశాలకు గైర్హాజరు కావడంతో ఎంఈవో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏకంగా ఈ విద్యాసంవత్సరం ఆరంభం నుంచే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టకుండానే అందిస్తున్నట్లుగా ఓ మహిళ పేరున నకిలీ బిల్లులు తయారు చేసి నిధులు కాజేసినట్లు గ్రామస్థులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. సదరు ఉపాధ్యాయుడు నెలలో కేవలం నాలుగు రోజులు మాత్రమే పాఠశాలకు వస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా చేసిన తనిఖీల్లో పాఠశాల రికార్డులకు, ఆన్‌లైన్ రికార్డులకు, మధ్యాహ్నభోజన రికార్డులకు పొంతన లేకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడంతో ఉపాధ్యాయుడు శంకర్‌కు షోకాజ్ నోటీసు అందించామని ఎంఈవో తెలిపారు. ఈ వ్యవహారాన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లి తదుపరి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.


విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంఈవో



నగరంలోని టీటీడీ కల్యాణ మండపం

కళ తప్పిన

టీటీడీ కల్యాణ మండపం

- ప్రైవేటు వ్యక్తులకు ఐదేళ్ల లీజుకు అప్పగింత
- ఒకప్పుడు శుభకార్యాలతో కళకళ
- నేడు వసతులు లేక బోసిపోతున్న వైనం
- సామాన్యులకు ఉపయోగపడని మండపం

ఖమ్మం ఖానాపురంహవేలి ఏప్రిల్ 13: ఖమ్మం నగరంలోని టీటీడీ కల్యాణ మండపాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడంతో కళ తప్పింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, సత్తుపల్లి, దమ్మపేట, పాల్వంచలోని టీటీడీ కల్యాణ మండపాలను ఐదేళ్ల లీజు ప్రతిపాదికంగా కాం ట్రాక్టర్లకు టీటీడీ ఆన్‌లైన్ టెండర్ల ద్వారా కాంట్రాక్టర్లకు అ ప్పజెప్పింది. సత్తుపల్లి, దమ్మపేట టీటీడీ కల్యాణ మండపాలను2022 మార్చి1 నుంచి ఐదేళ్లపాటు లీజుకు ఇచ్చింది.

ఖమ్మంలోని టీటీడీ కల్యాణ మండపం 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీవీ.చౌదరి ప్రారంభించారు. నాటి నుంచి కరోనా మొదటి దశ 2020 మార్చి వరకు టీటీడీ ఆధీనంలో నడిచేది. అప్పట్లో ఆధ్యాత్మిక, శుభకార్యాలకు వేదికగా నిలిచింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భక్తులు తిరుపతికి వెళ్లాలంటే ఈ కల్యాణ మండపంలోనే దర్శనాలకు సంబంధించి టోకెన్లు అందించేవారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండేయి. కానీ కరోనా మెదటి దశ నుంచి 2020 నుంచి కల్యాణ మండపంలోని టీటీడీ దర్శన టోకెన్ల కౌంటర్ ఎత్తివేయడంతో భక్తులు ఇబ్బందుకు గురయ్యారు. నాటి నుంచి నేటి వరకు తెలంగాణ వ్యాప్తంగా టీటీడీ కౌంటర్లను పూర్తిగా తీసివేశారు. చదువుకున్న వారు ఆన్‌లైన్లో దర్శనాలను బుక్ చేసుకుంటుండగా, చదువురాని గ్రామీణ ప్రాంతాల వారు ఈ కౌంటర్లు తీసివేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2020 నుంచి 2023 జూన్ వరకు కల్యాణ మండపం ఖాళీగా ఉండటంతో పలు అభివృద్ధి పనులు చేసేందుకు ఆన్‌లైన్లో టెండర్లు పిలిచారు. దీంతో ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యక్తి టెండర్ దక్కించుకొని పూర్తి స్థాయి పనులు చేయకుండా మమా అనిపించి టెండర్ తాలూకా మొత్తం డబ్బులు డ్రా చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అయినా టీటీడీ అధికారులు పట్టించుకోలేదని తెలిసింది.

ఖమ్మంలో టీటీడీ కల్యాణమండపం అస్తిత్వాన్ని కోల్పోతోంది. అటు ప్రభుత్వం ఇటు టీటీడీ అధికారులు పట్టించుకోకపోవడంతో మండపం కళతప్పింది. ఒకప్పుడు నగరం నడిబొడ్డున హంగులతో ఠీవీగా ఆధ్యాత్మిక, శుభకార్యాలకు వేదికైన టీటీడీ ప్రాంగణం, నేడు బోసిపోతోంది. నగరంలోని టీటీడీ కల్యాణ మండపానికి కార్యాలయ అధికారుల లెక్కల ప్రకారం సుమారు ఎకరంన్నర స్థలం ఉండేది. అందులో 19 గుంటల స్థలాన్ని పక్కనే ఏర్పాటు చేసిన వీధి వ్యాపారుల ప్రాంగణానికి అధికారులు కేటాయించారు. దీంతో విశాలమైన టీటీడీ ప్రాంగణం వైశాల్యం తగ్గిపోయింది. ఆ స్థలంలోనే తాగునీటి బావి, బోరు, సెప్టిక్ ట్యాంక్, పార్కింగ్ స్థలం ఉండేవి. అయితే వీధి వ్యాపారుల ప్రాంగణానికి కేటాయించిన స్థలంలో ఈ వసతులు ఉండటంతో, ప్రస్తుతం టీటీడీకి కాకుండా పోయాయి. టీటీడీ కల్యాణ మండపానికి ప్రస్తుతం పార్కింగ్ స్థలం లేదు. దీంతో శుభకార్యాలు, వస్త్ర, చేనేత ప్రదర్శనలు నిర్వహిస్తే వచ్చిన వారికి పార్కింగ్ సమస్య ఎదురవుతోంది. గతంలో పార్కింగ్‌కు ఉపయోగించుకున్న స్థలం ఇప్పుడు లేకపోవడంతో వాహనాలను నిలపడానికి స్థలం లేకుండాపోయింది. దీంతో స్థానికంగా శుభకార్యాలకు తీసుకుందామని వచ్చిన వారు కూడా పరిస్థితిని చూసి వెనుకంజ వేస్తున్నారు. టీటీడీకి ప్రత్యేకంగా నీటివసతి కూడా లేదు. అంతేకాకుండా మరుగుదొడ్లు కూడా పని చేయడం లేదు. ప్రస్తుతం అధికారులు ఆరు వరల సెప్టిక్ ట్యాంక్ మరమ్మతులు చేసి, ఊడిన పెచ్చులకు ప్యాచ్ పనులతో సరిపెట్టారు.



హస్తకళా ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

నిబంధనలకు విరుద్ధంగా ఎగ్జిబిషన్

టీటీడి నుంచి ఐదు సంవత్సరాలకు లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్‌కు టీటీడి కొన్ని షరతులు విధించింది. కేవలం ఆధ్యాత్మికత, శుభకార్యాలకు మాత్రమే నిర్వహించాలని షరతు పెట్టారని తెలిసింది. కాని లీజు దారుడు గత కొన్ని రోజులుగా చేనేత వస్త్ర ఎగ్జిబీషన్‌కు టీటీడీ కల్యాణ మండపాన్ని లీజుకు ఇవ్వడంతో విషయం తెలిసిన టీటీడీ అధికారులు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చి కొంత మొత్తంలో జరిమానా వేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి టీటీడీ కల్యాణ మండపంలో అన్ని వసతులు కల్పించి ప్రజలు ఉపయోగపడేలా చూడాలని కోరుతున్నారు.

భద్రాచలానికి ప్రారంభమైన విజయవాడ ప్యాసింజర్ రైలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఏప్రిల్13: కొంతకాలంగా రద్దైన భద్రాచలం-విజయవాడ ప్యాసింజర్ రైలు ఎట్టకేలకు శనివారం పునరుద్ధరణకు నోచుకొని ప్రారంభమైంది. మధ్యాహ్నం 1.45 గంటలకు విజయవాడకు డోర్నకల్ మీదుగా వెళ్లే ఈ రైలు ఈ నెల 21వ తేదీ వరకు నడుస్తుందని సౌత్ సెంట్రల్ రైల్వే కార్యాలయం వారు అధికారికంగా ఉత్తర్వులను విడుదల చేశారు. దీంతో భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీరామనవమికి వెళ్లే భక్తులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి దర్శించుకునేందుకు అవకాశం రావడంతో ప్రయాణికులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్మశానవాటికలో సర్వే

ఇల్లెందుటౌన్, ఏప్రిల్13: ఇల్లెందు పట్టణంలోని క్రిస్టియన్లకు చెందిన స్మశానవాటికలో తమకు పట్టా ఉందని సమాధులను కూల్చివేసిన సంఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులు శనివారం విచారణ చేపట్టారు. రెవెన్యూ ఆర్ఐ పద్మ, సర్వేయర్ హేమలు స్మశానవాటిక స్థలాన్ని పరిశీలించారు. పట్టా ఉన్న వ్యక్తి సలీం వద్ద నుంచి వివరాలను సేకరించారు. పట్టాదార్ పాస్‌బుక్‌తోపాటు అతడి వద్ద ఉన్న పూర్తి స్థాయి ఆధారాలను రాత పూర్వకంగా తీసుకున్నారు. అదేవిధంగా క్రిస్టియన్ల నుంచి కూడా స్థల వివరాల ఆధారాలను తీసుకున్నారు. కూల్చివేసిన సమాధుల స్థలాన్ని పోలీసులు పరిశీలించి పంచనామా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీకి యత్నం

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 13: వృద్ధురాలు మెడలో బంగారు గొలుసు చోరీ చేసేందుకు ఓ గుర్తు తెలియని వ్యక్తి శనివారం సాయత్రం యత్నించాడు. రోటరీనగర్‌కు చెందిన కుమిలి మంగమ్మ అను వృద్ధురాలు తన ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని బంగారు గొలుసు లాగేందుకు ప్రయత్నించాడు. అప్రమత్తమైన ఆమె గొలుసును గట్టిగా పట్టుకొని కేకలు వేసింది. దీంతో స్థానికులు వెంట పడటంతో అతడు అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై వృద్ధురాలు ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

కరకగూడెం, ఏప్రిల్13: మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం ఆటోను కరకగూడెం ఎస్ఐ రాజేందర్ శుక్రవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్ఐ రాజేందర్ తెలిపారు. సమాచారం మేరకు క్వింటన్నర రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. రేషన్ బియ్యం తరలిస్తున్న ఆటోను సీజ్ చేసి, వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్....

చింతకాని, ఏప్రిల్ 13: మున్నేరు చిన్నమండవ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో వద్ద పోలీసులు శనివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగుల్‌మీరా తెలిపారు.



అక్షరాల్లో అంబేద్కర్



భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా.. కల్లూరు మండల పరిధిలోని చెన్నూరుకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు దంతాల సుధాకర్ అక్షరాలతో అంబేద్కర్ చిత్రాన్ని రూపొందించారు. స్వతహాగా మైక్రో ఆర్టిస్ట్ అయిన సుధాకర్ ఐకొనొ ఆర్ట్ (అక్షరాలతో బొమ్మల సృష్టి) ద్వారా ప్రముఖుల చిత్రాలను గీస్తుంటారు. శనివారం ఆయన సృష్టించిన అంబేద్కర్ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని చెన్నూరులోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలు, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ ప్రాథమిక హక్కులు, విధులను పేర్కొంటూ ఈ చిత్రాన్ని గీసినట్లు తెలిపారు.

- కల్లూరు

అభ్యర్థి ఎవరైనా కాంగ్రెస్‌ను గెలిపించాలి

- రెండు రోజుల్లో ఖమ్మం అభ్యర్థిని ప్రకటించే అవకాశం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

కొత్తగూడెం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఖమ్మం లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరైనా పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఆ అభ్యర్థిని గెలిపించాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో పార్టీ అధిష్ఠానం ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో పొంగులేటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు ఇంకా 29రోజులే సమయం ఉందన్నారు. పార్టీ అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలంతా సమిష్టిగా పనిచేయాలని సూచించారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణాలర్పించారని ఈ సందర్భంగా పొంగులేటి గుర్తు చేశారు. రాహుల్‌గాంధీకి రెండుసార్లు ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా దేశంకోసం తృణప్రాయంగా ఆ పదవిని వదిలిపెట్టారన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ ఆడబిడ్డలు కాంగ్రెస్ అభ్యర్థికి మంచి మెజారిటీ తీసుకురావాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా కొత్తగూడెంలో పోటీ చేసిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును కాంగ్రెస్ పార్టీ కష్టపడి 28వేల మెజార్టీతో గెలిపించిందని గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 110రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేశామన్నారు. ఈ పథకం తెలంగాణ ప్రజలకు శాపంగా మారిందన్నారు. ఇంటింటికి తాగునీరు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. సమావేశంలో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపరిషత్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీసీబీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య, యర్రంశెట్టి ముత్తయ్య, జాలె జాకిరెడ్డి, ఆళ్ల మురళి, చింతలపూడి రాజశేఖర్, తూము చౌదరి, మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు గడిపల్లి కవిత, జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు తోట దేవిప్రసన్న, పాల్గొన్నారు.

'పాలేరు' నా సొంతిల్లు..

● కార్యకర్తలతో మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఏప్రిల్ 13: ఇకనుంచి వారానికో రోజు పాలేరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో శనివారం నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణుల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'పాలేరు నా సొంతిల్లు.. కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నాపై ఉంది. ఎంత పని ఒత్తిడి ఉన్నా.. వారానికో రోజు కేటాయిస్తాను..' అని పేర్కొన్నారు. రెండు మండలాలకు కలిపి ఒక పీఏను నియమిస్తున్నట్లు తెలిపారు. తద్వారా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏ శాఖలో సమస్య వచ్చినా.. పీఏలు అందుబాటులో ఉండి పరిష్కరిస్తారని తెలిపారు. పాలేరు ప్రజలకోసం కొత్త మొబైల్ ఫోన్ అందుబాటులోకి తీసుకవస్తానని దాని ద్వారా తనతో మాట్లాడొచ్చని తెలిపారు. నెలలో నాలుగు రోజులు పాలేరు ప్రజల కష్ట సుఖాల్లో పాలు పంచుకుంటానని, తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు.

కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకురాలు స్వర్ణకుమారి పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు హఫీజుద్దీన్ ఇంటికి మంత్రి వెళ్లి ఆత్మీయంగా పలకరించారు. తేనేటి విందు స్వీకరించారు.

3,723 కేజీల గంజాయి కాల్చివేత

- డిస్ట్రిక్ట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం

కొత్తగూడెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 13పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 55 కేసుల్లో సీజ్‌చేసిన 3,723వేల కేజీల గంజాయిని జిల్లా డ్రగ్ శనివారం జిల్లా కేంద్ర పరిధిలోని హేమచంద్రాపురం శివార్లలోని నిర్మానుష్య అటవీ ప్రాంతంలో పర్యావరణ కాలుష్యనియంత్రణ నిబంధనలను పాటిస్తూ జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు. కాల్చేసిన గంజాయి విలువ సుమారు రూ.9కోట్ల 31లక్షలు ఉంటుంది. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ రోహిత్‌రాజు, సభ్యులైన భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కోర్టు అనుమతి తీసుకుని ఈ నిషేధిత గంజాయిని ఉదయం నుంచి సాయంత్రం వరకు దశలవారీగా దహనం చేశారు. ముందుగా జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్, ఎస్పీ రోహిత్‌రాజు పోలీస్‌స్టేషన్ల వారీగా కొన్ని భాగాలుగా విభజించిన గంజాయిని హెడ్‌క్వార్టర్స్‌లో తూకం వేసి పరిశీలించారు. అనంతరం మొత్తం గంజాయిని హేమచంద్రాపురంలోని అటవీ ప్రాంతానికి తరలించి కాల్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో నిల్వ ఉన్న గంజాయిని దహనం చేశామని తెలిపారు. కొందరు అక్రమార్జనలో భాగంగా గంజాయిని విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను మత్తులోకి దించుతున్నారన్నారు. ఇలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా రహస్యబృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై ఎవరైనా గంజాయిలాంటి మత్తుపదార్థాలను సేవించి పట్టుబడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు అబ్దుల్ రెహమాన్, సతీష్‌కుమార్, డీసీఆర్బీ డీఎస్పీ మల్లయ్యస్వామి, సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు, సీఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గంజాయి తూకాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

సారా స్థావరాలపై దాడులు

- 200 లీటర్ల బెల్లం పానకం, ధ్వంసం
- మూడు లీటర్ల సారా స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు

జూలూరుపాడు, ఏప్రిల్13: మండలంలోని కొమ్ముగూడెం, పాపకొల్లు గ్రామాల్లో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది శనివారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి, మూడు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. పాపకొల్లు గ్రామానికి చెందిన భూక్య టాకిర్యా అటవీ ప్రాంత సమీపంలో సారాబట్టిని ఏర్పాటు చేసి సారా తయారు చేసేందుకు 200లీటర్ల బెల్లం పానకాన్ని సిద్ధంగా ఉంచగా దానిని పారబోశారు. అతని వద్ద నుంచి సారాను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొమ్ముగూడెం గ్రామానికి చెందిన భూక్యా భారతి వద్ద సారా పట్టుబడింది. ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ జే. రమేష్, హెడ్‌కానిస్టేబుల్ ప్రకాష్, సిబ్బంది రామారావు, మల్లయ్య, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



పాపకొల్లులో బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

నకిలీ మొక్కజొన్న విత్తనాలపై ఫిర్యాదు

ఏన్కూరు, ఏప్రిల్13: నకిలీ మొక్కజొన్న విత్తనాల అమ్మిన ఫీల్డ్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు వ్యవసాయ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని నాచారం గారమంలో కాకాటి యోహాను, బానోతు వీరన్నలు మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మిర్చి తోటను సాగు చేశారు. వైరస్ సోకడంతో మిర్చితోట పాడైపోయింది. తమ ఏరియాలోని సబ్సిడీ కింద మొక్కజొన్న విత్తనాలు ఇచ్చే ఫీల్డ్ ఆఫీసర్ మిర్చి తోటను పరిశీలించి తోటలను తొలగించమని, తమ కంపెనీ ఉచితంగా మొక్కజొన్న విత్తనాలతో పాటు పెట్టుబడికి రూ.20వేలు, ఇస్తుందని, మొక్కజొన్న క్వింటా రూ.2200 పెట్టి తామే కొంటామని చెప్పి మొక్కజొన్న పంట సాగు చేయించారని పేర్కొన్నారు. మొక్కజొన్న సాగు చేసి 70రోజులు గడుస్తున్నా మొక్కలు రెండు అడుగులు కంటే ఎదగకపోవడంతో తమకు విత్తనాలు ఇచ్చిన ఫీల్డ్ ఆఫీసర్‌ను నిలదీయగా సమాధానం చెప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఎకరాలకు గాను రూ.2.40లక్షల నష్టం వచ్చిందని, దీనిపై విచారణ జరిపి ఫీల్డ్ ఆఫీసర్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఏవో నర్సింహారావుకు రైతులు ఫిర్యాదు చేశారు.

ప్రైవేటు పాఠశాల అత్యుత్సాహం

- షెడ్యూల్‌కు వారం ముందే ఎస్ఏ2 పరీక్షలు
- యాజమాన్యానికి షోకాజ్ నోటీస్

వైరా, ఏప్రిల్ 13: ఖమ్మం జిల్లా వైరాలో ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యం జిల్లా విద్యాశాఖ ఉత్తర్వులను తుంగలో తొక్కింది. జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు పర్యవేక్షణలో జరిగే సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ-2) పరీక్షలను వారం రోజుల ముందే నిర్వహించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 15 నుంచి నిర్వహించాల్సిన ఎస్ఏ2 పరీక్షలను సదరుపాఠశాల యాజమాన్యం ఈ నెల 8, 10 తేదీలలో నే నిర్వహించింది. ఈ వ్యవహారం శనివారం బయటకు పొక్కింది. డీఈవో సోమశేఖరశర్మ ఆదేశాల మేరకు కొణిజర్ల ఎంఈవో శ్యాంసన్ పాఠశాలను సందర్శించి యాజమాన్యాన్ని, విద్యార్థులను విచారించారు.

వివరాల్లోకి వెళితే ఎస్ఏ2 పరీక్షలను ఈనెల 15 నుంచి ఖమ్మం జిల్లాలోని 6, 7,8,9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించాల్సి ఉంది. వైరాలోని మేరీ ఇమాక్యూ లేట్ పాఠశాల యాజమాన్యం మాత్రం విద్యార్థులకు ఈనెల 8న తెలుగు, 10న హిందీ పరీక్ష నిర్వహించింది. దీంతో తెలుగు, హిందీ ప్రశ్నాపత్రాలు ఈ పాఠశాల నిర్వాకం వలన ముందే బయటకు వచ్చినట్లయింది.

డీఈవో ఆదేశాలతో ఎంఈవో శ్యాంసన్ పాఠశాలను సందర్శించి ప్రశ్నాపత్రాల బండిల్స్‌ను పరిశీలించారు. తెలుగు, హిందీ పరీక్షలు నిర్వహించడాన్ని నిర్ధారించా రు. ముందుగా పరీక్షలు నిర్వహించడంపై పాఠశాల ప్రిన్సిపాల్ నేనాను ఎంఈవో ప్రశ్నించారు. ఆ తర్వాత 9వ తరగతి విద్యార్థులను పరీక్షల నిర్వాహణపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీఈవోకు ఎంఈవో నివేదిక పంపించారు. 24 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ పాఠశాల యాజమాన్యానికి ఎంఈవో షోకాజ్‌నోటీస్ జారీ చేశారు.



విద్యార్థులను విచారిస్తున్న ఎంఈవో శ్యాంసన్

విద్యార్థులకు ట్యాబ్‌ల వితరణ

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13: మండల పరిధిలోని మద్దులపల్లిలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థులకు నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 30 ట్యాబ్‌లను శనివారం వితరణగా అందజేశారు. సీఎస్ఆర్ యాక్టివిటీలో భాగంగా కళాశాలలోని విద్యార్థులకు సాంకేతిక ప్రయోజనాలు అందించాలనే ఉద్దేశ్యంతో ట్యాబ్‌లను అందజేసినట్లు ఆర్గనైజేషన్ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంఖానాపురంహవేలి, ఏప్రిల్ 13: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో గల మహాత్మాజ్యోతిబాఫూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈనెల 15వరకు పొడిగించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వేమసాని వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 మార్చిలో ఇంటర్ రెండో ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులందరూ ఈపరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈకళాశాల ఎస్ఎస్ఆర్‌మూర్తి పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఉందని, ఇక్కడ విద్యార్థులకు మాత్రమే ప్రవేశం ఉందని, విద్యార్థులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలో కళాశాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రవేశాలకు ఎంపికైన వారికి ప్రభుత్వం నుంచి ఉచితంగా అన్నిరకాల సౌకర్యాలు లభిస్తాయని తెలిపారు.

నిద్రిస్తున్న భార్యపై దాడి

● అనుమానమే దాడికి కారణం.. ● మహిళ పరిస్థితి విషమం

చింతకాని, ఏప్రిల్ 13: అనుమానం పెనుభూతమె నిద్రిస్తున్న భార్యపై రోకలి బండతో దాడి చేసి ఆమెను హతమార్చేందుకు ప్రయత్నించాడు ఓ వ్యక్తి.. ఖమ్మం జిల్లా చింతకాని మండలం బస్వాపురం గ్రామంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రసపుత్ర ముత్తారావుకు తన భార్య లలిత ప్రవర్తనపై కొంత కాలంగా అనుమానం ఉంది. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఇటీవల తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి గొడవ జరగడంతో ఇంటినుంచి బయటకు వెళ్లిన ముత్తారావు తెల్లవారుజామున ఇంటికి వచ్చి నిద్రిస్తున్న భార్యపై రోకలిబండతో దాడి చేశా డు. దీంతో ఆమె తలకు తీవ్ర గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు ఆమెను ఆటోలో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. సంఘటనా స్థలాన్ని వైరా సీఐ సాగర్, ఎస్ఐ నాగుల్‌మీరా సందర్శించి ఘటనపై ప్రాథమిక విచారణ నిర్వహించి కేసు నమోదు చేశారు.

ఖమ్మంలో యువకుడిపై...

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 13: యువకుడిపై కొంతమంది దాడి చేసేందుకు యత్నించిన సంఘటనలో అడ్డొచ్చిన తండ్రిపై యువకులు దాడిచేసిన సంఘటన ఖమ్మం నగరంలో జరిగింది. నగరంలోని సరిత క్లీనిక్ సెంటర్ నుంచి బస్‌డిపో రోడ్డుకు వెళ్లేదారిలో నబి అనే యువకుడు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. ఇటీవలే ఆ యువకుడు ప్రేమ వివాహం చేసుకున్నాడు. సదరు యువకుడి ఇంటి ముందు కావాలని ఇద్దరు యువకులు శనివారం రాత్రి గొడవపడుతున్నారు. ఈ క్రమంలో సదరు యువకుడు వచ్చి ఏంటి గొడవ అని అడిగాడు. అది గమనించి సమీపంలో ఉన్న సుమారు మరో 20 మంది యువకులు ఒక్కసారిగా అక్కడికి వచ్చి అతడిపై దాడి చేసేందుకు వచ్చారు. వెంటనే ఆ యువకుడు ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అక్కడే ఉన్న అతడి తండ్రిపై ఆ యువకులు దాడి చేశారు. విషయం తెలిసిన టూటౌన్ పోలీసులు సంఘటన వద్దకు చేరుకోగా వారిని చూసి అక్కడున్న వారంత పారిపోయారు. కాగా ప్రేమ వివాహం చేసుకున్నందుకే కావాలని ఈ దాడికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

బొజ్జాయిగూడెంలో కాంగ్రెస్ నాయకుడిపై ..

● పోలీసులకు ఫిర్యాదు

ఇల్లెందురూరల్, ఏప్రిల్13: ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం గ్రామంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఆరెం కిరణ్‌పై కొందరు గ్రామస్థులు శనివారం దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..బొజ్జాయిగూడెం గ్రామంలో ఉన్న పార్టీ కార్యాలయంలో ఒంటరిగా ఉన్న తనపై గ్రామానికి చెందిన మెట్ల వెంకన్న, మెట్ల నవీన్, సురేష్, శీలం రాకేష్ అనే వ్యక్తులు వాగ్వాదానికి దిగి, దాడికి పూనుకున్నారని శనివారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో కూడా గ్రామంలో తన ఫ్లెక్సిలను చించివేశారని, అదేవిధంగా బోరు బావి వేస్తుండగా తాను అడ్డుకున్నానని బెదిరిస్తూ తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అగ్నిప్రమాదంలో మూడు పల్లెప్రకృతి వనాల దగ్ధం

● రూ.5లక్షల ఆస్తి నష్టం

తల్లాడ, ఏప్రిల్ 13: మండల కేంద్రమైన తల్లాడలో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో మూడు గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాలు దగ్ధమయ్యాయి. వివరాల ప్రకారం.. పల్లె ప్రకృతి వనాలకు సమీపంలోని పొలంలో పత్తి కట్టెను దగ్ధం చేసేందుకు ఓ రైతు నిప్పంటించాడు. గాలి ఉధృతికి మంటలు వ్యాప్తిచెంది మంగాపురం పల్లె ప్రకృతి వనానికి మంటలు అంటుకున్నాయి. ఆతర్వాత తల్లాడ, నారాయణపురం గ్రామాలకు చెందిన పల్లె ప్రకృతి వనాలకు కూడా మంటలు వ్యాప్తి చెందడంతో దగ్ధమయ్యాయి. ప్రమాద సమాచారం తెలుసుకున్న గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్‌తోను మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మూడు పల్లె ప్ర కృతి వనాలు దగ్ధమయ్యాయి. ఎకరంన్నర విస్తీర్ణంలోని మూడు పల్లె ప్రకృతి వనాల్లోని మొక్కలు, చెట్లు దగ్ధం కావడంతో రూ.ఐదులక్షల మేరకు నష్టం వాటిల్లింది.



అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న పల్లె ప్రకృతివనం



బ్రెయిన్‌స్ట్రోక్ బాధితుడికి ఆర్థిక సాయం

పాల్వంచ, ఏప్రిల్ 13: బ్రెయిన్‌స్ట్రోక్‌తో బాధపడుతూ వాస్కులర్ సర్జరీకి సిద్ధపడుతున్న బాధితుడికి చలువాది ట్రస్ట్ శనివారం ఆర్థిక సహకారం అందించింది. కొత్తగూడెంకు చెందిన వేణుగోపాల్‌కు ఇటీవల బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చింది. దాంతో డాక్టర్లు అతనికి వాస్కులర్ సర్జరీ చేయాలని సూచించారు. కానీ ఆపరేషన్‌కు కావలసిన రూ.4లక్షలు చెల్లించే ఆర్థిక పరిస్థితి అతనికి లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులు పాల్వంచలోని చలువాది ట్రస్ట్‌ను సంప్రదించారు. స్పందించిన ట్రస్ట్ అధ్యక్షుడు చలువాది ప్రకాష్ వారి మిత్రబృందం ఆపరేషన్ నిమిత్తం తమ వంతు సాయంగా వేణుగోపాల్ సతీమణి రోహిణికి రూ.30 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు చలువాది రాజ్యలక్ష్మి, కొత్తగుండ్ల కుటుంబరావు, చిరునోముల ప్రసాద్, వాసవీక్లబ్ అధ్యక్షులు గూడెపు శ్రీనివాస్, సాయి లిఖిత్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

రోడ్డు ప్రమాదంలో బొగ్గు లారీ నుజ్జు

బీటీపీఎస్ సమీపంలో రోడ్డుపైనే లారీల నిలిపివేత

పొంచి ఉన్న ప్రమాదాలకు సంకేతం

యార్డులో పార్కింగ్ చేసుకోండి.. వాహన చోదకుల డిమాండ్

మణుగూరు, ఏప్రిల్ 13: మణుగూరు ఓసీ గనుల నుంచి బొగ్గును బీటీపీఎస్‌కు తరలించే ఓ లారీ శనివారం రోడ్డు ప్రమాదానికి గురైంది. అదృష్టవశాత్తు స్వల్పగాయాలతో లారీ డ్రైవర్ బతికి బయట పడ్డాడు. మండలంలోని సాంబాయిగూడెం గ్రామంలో ప్రధాన రహదారిపై ఈ సంఘటన చోటు చేసుకుంది. లారీ శుక్రవారం ఉదయం బొగ్గు లోడ్ వేసుకుని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌కు వెళుతోంది సాంబాయిగూడెం ప్రభుత్వ పాఠశాల సమీపంలోకి వచ్చే సరికి ఇసుక లోడ్‌తో వస్తున్న మరో లారీ ర్యాంపు దారి నుంచి మొయిన్ రోడ్డు ఎక్కుతోంది. ఈ క్రమంలో వరుసగా వెలుతున్న ఉన్న బొగ్గు లారీలు ఒక్కసారిగా ఆగిపోవడంతో ఈ లారీ ఆ విషయాన్ని గమనించపోవడంతో వెనుక నుంచి మరో బొగ్గు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ ముందటి భాగం అంతా నుజ్జైంది. స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రున్ని ఆసుపత్రికి తరలించారు.

మితిమీరిన వేగమే ప్రమాదాలకు కారణం

బీటీపీఎస్‌కు బొగ్గును సరఫరా చేసే బొగ్గు లారీలు, టిప్పర్లు ఈ మార్గంగుండా మితిమీరిన వేగంతో వెళ్లడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రిప్పులను త్వరితగతిన పూర్తి చేయాలన్న ఆశతో డ్రైవర్లు అతివేగంగా రాకపోకలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని నియంత్రించే వారే కరువయ్యారు. ఈ మూడు నెలల కాలంలో దాదాపు 5 ప్రమాదాలు జరిగాయి. ఇప్పటికైనా లారీ అసోసియేషన్ సభ్యులు తమ వాహనాలను, ఈ వాహనాలను నడిపే డ్రైవర్లకు సరైన నిబంధనలు విధిస్తే గానీ ప్రమాదాలు నివారించడం జరుగుతుందని స్థానికులు అంటున్నారు.

బీటీపీఎస్ రోడ్డుపై లారీల నిలిపివేత

ఓ వైపు ప్రమాదాలు జరుగుతున్న విషయాలు దర్శనమిస్తున్నా కూడా బీటీపీఎస్ అధికారుల చర్యలు మాత్రం కొంత విడ్డూరంగా ఉంటున్నాయి. ప్లాంట్‌లోకి వెళ్లాల్సిన బొగ్గు లారీలను ప్రధాన రహదారి పైనే నిలిపివేస్తున్నారు. ప్రధాన గేట్ వద్ద తనిఖీల పేరుతో లారీలను ఆపివేయడం వల్ల మణుగూరు-పినపాక ప్రధాన రహదారిపై లారీలు ఈ ప్రాంతంలో భారీ సంఖ్యలో నిలిచిపోతున్నాయి. దీంతో ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడటమే కాకుండా పొంచి ఉన్న ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. ఎప్పుడు ఏ వాహనం అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతాయో అన్న ఆందోళనలు స్థానికంగా వ్యక్తం అవుతున్నాయి. మొయిన్ గేట్ వద్దే బొగ్గు చెక్ పాయింట్ కాకుండా అంతర్గతంగా లారీలను నిలుపుకునేందుకు చెకింగ్ చేసేందుకు యార్డులు, చెక్ పాయింట్‌లు ఏర్పాటు చేస్తే వాహనాలు ఇలా రోడ్డుపై ఇబ్బందికర పరిస్థితులను నెలకొనవని స్థానికులు, ఇతర వాహన చోదకులు అంటున్నారు.



బీటీపీఎస్ గేట్ సమీపంలో ప్రధాన రహదారిపై లారీలు

-- పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలి

మణుగూరులో బొగ్గు లారీ వేగాలను అరికట్టించేందుకు, బిటిపిఎస్ వద్ద లారీ నిలిపే అంశాలపై పోలీసులు అధికారులు దృష్టి సారించాలని వాహన చోదకులు కోరుతున్నారు. జరుగుతున్న ప్రమాదాల క్రమంలో సత్వర చర్యలను చేపట్టాలంటున్నారు. లారీ ఒనర్స్ అసోసియేషన్‌కు టిప్పర్ డ్రైవర్లకు నిర్దిష్టమైన సూచనలు చేస్తే గానీ నియంత్రణ ఉండంటున్నారు. టిప్పర్లు , బొగ్గు లారీలు వస్తున్నాయంటే ఇతర వాహన చోదకులు ప్రాణాలు అరచేత పెట్టుకుని వాహనాలను నడిపే దుస్థికి చెక్ పెట్టాలని పలువరు డిమాండ్ చేస్తున్నారు.

సద్గురు ఆశ్రమాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే జారేను సన్మానిస్తున్న కమిటీ బాధ్యులు

ములకలపల్లి, ఏప్రిల్ 13: మండల పరిధిలోని రామచంద్రాపురంలో కొలువైన శ్రీ సద్గురు ఆశ్రమాన్ని అచలపీఠం ఆహ్వానం మేరకు శనివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆశ్రమ విశిష్టతను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్, మాజీ జడ్పీటీసీ బత్తుల అంజి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్వతనేని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మండల పరిధిలోని చాపరాలపల్లి గ్రామానికి చెందిన పర్వతనేని రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆమె నివాసానికి వెళ్లి రమాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వారికి సంతాపం తెలిపి, సానుభూతి వ్యక్తం చేశారు.

‘ఉపాధి’ కూలీల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇఫ్టూ నాయకుడు

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 13: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు తుపాకుల నాగేశ్వరావు, జిల్లా నాయకులు కొక్కు సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రేంపేడు గ్రామంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కూలీలకు ఎండల నుంచి రక్షణగా పని ప్రదేశాలలో టెంట్‌లు ఏర్పాటు చేయాలని, మజ్జిగ ప్యాకెట్‌లు అందించాలని, పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులు ఖాతాలో జమ చేయాలని, మెడికల్ కిట్‌లను ఉంచాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగాన్ని మార్చాలంటున్న బీజేపీని ఓడించాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు

భద్రాచలం, ఏప్రిల్ 13: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రజలందరి బాధ్యతని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా భారత రాజ్యాంగం ఎదురవుతున్న సవాళ్లు అనే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్యంకు, పౌర హక్కులకు భంగం కలిగించే విధానాలను బీజేపీ అనుసరిస్తుందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాల కాలంలో అనేక తిరోగమన నిర్ణయాలు తీసుకుందన్నారు. ఒక పక్క అంబేద్కర్‌ను పొడుగుతూనే లక్ష్యాలకు ఆశయాలకు తూట్లు పొడుస్తుందని విమర్శించారు. ప్రజాస్వామ్యం అంటేనే అంబేద్కర్ అని అటువంటి ప్రజాస్వామ్యం విలువలకు తిలోదకాలు ఇవ్వాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాయడం తప్ప బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆయన ఆరోపించారు. ఈ పాలనకు చరమగీతం పాడాలని కోరారు. ఈ సదస్సులో ఎంబీ నర్సారెడ్డి, బీబీజీ తిలక్, వై.వెంకట రామారావు, ఎస్.లీలావతి, డి.సీతాలక్ష్మి, యు.జ్యోతి, ఎస్.నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మచ్చా వెంకటేశ్వర్లు

వైభవంగా నాభిశిల వార్షికోత్సవ పూజలు

దమ్మపేట, ఏప్రిల్ 13: నాభిశిల మూడవ వార్షికోత్సవ పూజలు లింగాలపల్లి గ్రామంలో శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లింగాలపల్లి పరిసర గ్రామాల నుంచి భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేగ్రామంలో అంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించి పూజలు చేశారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే

ఘనంగా సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ

ఇల్లెందుటౌన్, ఏప్రిల్ 13: ఇల్లెందు పట్టణంలోని 1వవార్డు సత్యనారాయణపురంలో శ్రీరామ ఆలయంలో శనివారం సరస్వతి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణపురం గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పెద్దఎత్తున విగ్రహ ప్రతిష్ఠ వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సీతారాముల వివాహ పనులు ఆరంభం

అశ్వారావుపేట, ఏప్రిల్ 13: అశ్వారావుపేట పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు శ్రీ రామనవమి వేడుకలను జరుపనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ ముత్తా సుమాకర్ తెలిపారు. ఈ నెల 17న జరిగే శ్రీ రామనవమి సందర్భంగ ఇప్పటికే ఆలయం ఆధ్వర్యంలో వివాహానికి అవసరమైన అక్షింతలను ఊరూరంతా కలసి వచ్చి తలో చేయి వేసి కలిపారు. శనివారం అక్షింతలు, సీతారాముల వారి వివాహ వేడుకలను సందర్భంగా ముద్రించిన ఆహ్వానపత్రికలను భక్తులు ఇంటింటికి తిరిగి భక్తులను శ్రీ రామనవమి వేడుకలకు ఆహ్వానించారు. పట్టణంలో ఊరేగింపు జరిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ

దమ్మపేట, ఏప్రిల్ 13: పూసుకుంట, కట్కూరు, కొత్తూరు గ్రామాలకు చెందిన గిరిజనులు, కొండరెడ్ల కుటుంబాలకు హైద్రాబాద్‌కు చెందిన స్మైల్ ఆల్వేస్ పౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం 210 కుటుబాలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పేద ప్రజలకు సేవా కార్యక్రమంలో భాగంగా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్నట్లు పౌండేషన్ డైరెక్టర్ కోడి సుదమనుడు అన్నారు. ఈ కార్యక్రమంలో టి.సైలేష్ పాల్, పాస్టర్ మడివి ఎలీషా, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

గుండాలపాడులో వైద్య శిబిరం

ములకలపల్లి, ఏప్రిల్ 13: మండల పరిధిలోని మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల తిమ్మంపేట సబ్‌సెంటరు పరిధిలో శనివారం పాత గుండాలపాడు, పగడాలనగర్ గ్రామాల్లో డాక్టర్ సాయికల్యాణ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇంటిరియల్ హైరిస్క్ గ్రామాల నిఘాలో భాగంగా ఈ గ్రామాల్లో హెల్త్‌క్యాంపు నిర్వహించడం జరిగిందని తెలిపారు. శిబిరంలో పీహెచ్ఎస్ దయామణ, హెల్త్ సూపర్‌వైజర్స్ శ్రీ కృష్ణ, నాగమణి, హెల్త్ అసిస్టెంట్ హనుమంతరావు, ఎఎన్ఎం రమాదేవి పాల్గొన్నారు.

దళారులతో నష్టపోతున్న రైతులు

బూర్గంపాడు, ఏప్రిల్ 13: మండలంలో ధాన్యం కొనుగోళ్లలో దళారులు సిండికేట్‌గా మారటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు సాయి శ్రీను పేర్కొన్నారు. శనివారం బూర్గంపాడులో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి లైసెన్స్‌లు లేకుండా రైతుల వద్ద దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. తమకు ఇష్టంవచ్చిన ధరలతో దళారులు ఇస్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో గిట్టు బాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దళారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కాపుల వెంకటేశ్వర్లుకు ఘన నివాళి

భద్రాచలం, ఏప్రిల్ 13: క్షేత్రస్థాయిలో పార్టీని నిర్మించడమే కాపుల వెంకటేశ్వర్లుకు ఇచ్చే ఘనమైన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలో కాపుల వెంకటేశ్వర్లు 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎంబీ నర్సారెడ్డి తదితరులు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో బీబీజీ తిలక్, వై.వెంకటరామారావు, లీలావతి, డి.సీతాలక్ష్మి, జ్యోతి, ఎం.నాగరాజు కోరాడ శ్రీనివాస్, కాపుల లక్ష్మి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



వివరాలు వెల్లడిస్తున్న ఎంపీటీసీ ప్రమోద్

ఇల్లెందురూరల్, ఏప్రిల్ 13: ఇల్లెందు మండలం బాలాజీనగర్ గ్రామపంచాయతీలోని ఆజాద్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఎంపీటీసీ దాస్యం ప్రమోద్, గ్రామస్తులు డిమాండ్ చేశారు. శనివారం ఆజాద్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాత్రికి రాత్రే డోజర్‌లతో చదును చేసి ఇళ్ల స్థలాలుగా అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన

పినపాక, మార్చి 13: పినపాక శాసన సభ్యుడు పాయం వెంకటేశ్వర్లు శనివారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్ వర్తక సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలావేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రాస్‌రోడ్‌లో వేసవి దాహార్తిని తీర్చేందుకు, చలివేంద్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అభినందించారు. భవిష్యత్తులో సమాజసేవకు తమ వంతు సాయంగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. అనంతరం వర్తక సంఘం సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. ఏడూళ్ల బయ్యారం పంచాయతీ పరిధిలోని గాండ్లబయ్యారం గ్రామంలోని రామాలయంలో గణపతి దాసాంజనేయ సీతాసమేత రామచంద్ర స్వామి విగ్రహ పతిష్ఠకు ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం జానంపేట గ్రామంలోని అంజనేయ స్వామి ఆలయంలో సీతారామ విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికారు. విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా నిర్వహించిన శాస్త్రోక్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు జి.రామనాథం, వెంకటరెడ్డి, లక్ష్మారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కళ్యాణి, భవతి, కస్తూరి లింగయ్య, బండారు సాంబశివరావు, బడే కృష్ణ పాల్గొన్నారు.



ప్రతిష్ఠా కార్యక్రమంలో పాల్గొన్న పాయం

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంకండి

కాంగ్రెస్ మండల స్థాయి నాయకులకు పొంగులేటి సూచన

చుంచుపల్లి, ఏప్రిల్ 13: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధమవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎవరికి టిక్కెట్ కేటాయించిన గెలిపించుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నాయకులను కోరారు. శనివారం విద్యానగర్ కాలనీలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం నియోజకవర్గ స్థాయిలో ఐదు మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతి మండలంలో ఉన్న ఓటర్ల సంఖ్యను బట్టి ఇన్‌చార్జీలను నియమించుకొని కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రతి ఒక్కరు ఓటు వేసేలా కాంగ్రెస్ కార్యకర్తలు పని చేయాలన్నారు. ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించాలన్నారు. గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా పని చేయాలని ఆయన కోరారు. ఇందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. అనంతరం చుంచుపల్లి, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలు, పాల్వంచ, కొత్తగూడెం పట్టణాల నాయకులతో వేరు వేరుగా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోరే బాబు, కుమార్, కరుణాకర్, లక్ష్మణ్, హుస్సేన్, రఘు, రవి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

బీఆర్ఎస్‌కు రాజీనామా

దుమ్ముగూడెం, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి కెల్లా శేఖర్ శనివారం ప్రకటించారు. తొమ్మిదేళ్లుగా పార్టీలో పనిచేస్తున్నప్పటికీ, తనకు సముచిత స్థానం దక్కలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అనుచరునిగా ఆయన బాటలో నడుస్తానని తెలిపారు. వెంకట్రావుపై ఎమ్మెల్సీ మధు వ్యాఖ్యలు అభ్యంతకరకంగా ఉన్నాయన్నారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 13: మున్నూరుకాపు సంఘం అభివృద్ధికి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శనివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మున్నూరుకాపు సంఘం భద్రాద్రి జిల్లా కన్వీనర్ ఆది కోటేశ్వరరావు కలసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపులకు రూ.2వేలకోట్లు కార్పొషన్ నిధులు విడుదల చేయాలని, జిల్లా కేంద్రంలో బాలిక, బాలుర వసతి గృహ నిర్మాణం కోసం రూ.3కోట్లు కేటాయించాలని అయన ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ వెనకబడిన కులాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పినట్టు తెలిపారు.

ఫైనాన్స్ సంస్థలలో పోలీసుల తనిఖీలు

అశ్వారావుపేట, ఏప్రిల్ 13: అశ్వారావు పట్టణంలో శనివారం రాత్రి పోలీసులు పలు ఫైనాన్స్ సంస్థలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. అశ్వారావుపేట పరిసరాలలో అక్రమ ఫైనాన్స్ వ్యాపారాలు, అధిక వడ్డీ వ్యాపారాలు నిర్వహిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. అశ్వారావుపేట సీఐ జితేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సైలు శ్రీను, శివరామకృష్ణ బృందం పట్టణంలోని భద్రాచలం రోడ్డులోని రెండు షాపులు, పాత ఆంధ్రాబ్యాంకు రోడ్డులో షాపులపై ఆకస్మిక దాడులు చేశారు. ఆయా దుకాణాలలో రికార్డులు, పరిశీలించారు. దాడులకు సంబంధించి పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. దీనిపై సీఐ జితేందర్ రెడ్డిని వివరణ కోరగా సాధారణ తనిఖీలలో భాగమేనన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 13: మండల పరిధి భైరాగులపాడు ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి పక్కన మద్ది ఖాదరమ్మ ఇంటిలో నిర్వహిస్తున్న కిరాణా దుకాణం శనివారం రాత్రి అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. ఇంట్లోని సామాగ్రి, నగదు, వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రూ.లక్ష వరకు ఆస్థి నష్టం జరిగిందని బాధితురాలు తెలిపారు. అగ్నిమాపక శకటం మంటలను అదుపు చేసింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

ట్రాఫిక్ పోలీసులకు మజ్జిగ ప్యాకెట్లు



ఖమ్మంక్రైం, ఏప్రిల్ 13: నగరంలో ఎండతీవ్ర అధికమవుతున్న నేపథ్యంలో విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు వీఎస్ఆర్ డెయిరీ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నగరంలోని పలుప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ సిబ్బందికి ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అందించారు. నెలరోజులపాటు ట్రాఫిక్ సిబ్బందికి రోజుకు వంద మజ్జిగ ప్యాకెట్ల చొప్పున అందించనున్నట్టు ఏసీపీ తెలిపారు ఈ కార్యక్రమంలో డెయిరీ సిబ్బంది లింగరాజు, కమలాకర్, నర్సింహారావు, ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వ్యాఖ్యలు అహంకార పూరితం

దుమ్ముగూడెం, ఏప్రిల్ 13: ఎమ్మెల్సీ తాతా మధు దురహంకారంతో ఆదివాసీ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుపై చేసిన వ్యాఖ్యలు అగ్రకుల అహంకార పూరితంగా ఉన్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ శనివారం విమర్శించారు. వేరే పార్టీ నుంచి గెలిచిన వ్యక్తుల్ని మీ పార్టీలో చేర్చుకున్నప్పుడు లేని తప్పు వెంకట్రావుకు ఎలా ఆపాదిస్తారని ప్రశ్నించారు. పదిహేనేళ్లుగా ప్రజాక్షేత్రంలో పనిచేసి అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్న ఎమ్మెల్యే వెంకట్రావు కరోనా సమయంలో ప్రజలకు విస్తృత సేవలందించారని పేర్కొన్నారు. విద్యావంతుడు, ఆదివాసీ ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజలు హర్షించరన్నారు. ఈ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ

కరకగూడెం, ఏప్రిల్ 13: కరకగూడెం పంచాయితీలో డ్రైనేజీ వ్యవస్థఅస్తవ్యస్తంగా మారింది. సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 2016 సంవత్సరంలో ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మించిన అధికారులు.. కరకగూడెం ప్రధాన సెంటర్‌లో లక్షల వ్యయంతో అధికారులు డ్రైయినేజీ నిర్మించారు. అధికారులు డ్రైనేజీ నిర్మించిన నీరు పెద్దవాగుకు వదలడం మరవడంతో.. డ్రైయినేజీలో గ్రామంలోని చికెన్, వ్యర్థ, చెత్తచెదరాం కలవడంతో దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెద్ది ప్రజలు రోగల బారిన పడుతున్నారు. సర్పంచుల పదవి కాలం మూగియడంతో.. ఉన్నత అధికారులు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. సర్పంచులు పాలన సాగించడంతో కొంత మేర పంచాయితీలలో సమస్యలు పరిష్కారం అవుతుండేవి. కానీ స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ప్రజలు సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో సతమతం అవుతున్నారు. స్పెషల్ ఆఫీసర్ల పాలనలో పారిశుధ్య పనులు కూడా చేయడం లేదని.. చెత్త ట్రాక్టర్లతో చెత్తను కూడా తరలించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం పక్కనే ఉన్న డ్రైయినేజీలలో దుర్వాసన వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో అధికారుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా కనిపిస్తోందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తక్షణమే డ్రైయినేజీలను శుభ్రం చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



డ్రెయిన్‌లో నిండుకున్న చెత్త

పనివేళల్లో మార్పు చేయాలి

రుద్రంపూర్, (సింగరేణి) ఏప్రిల్ 13: వేసవి ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని సింగరేణి ఓపెన్‌కాస్టుల్లో పని వేళలు మార్చాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ప్రతినిధి బృందం శనివారం జేవీఆర్ ఓపెన్‌కాస్టు మేనేజరు దుర్గా ప్రసాద్‌కు వినతిపత్రం అందచేసింది. ఈ సందర్భంగా ఫిట్ కార్యదర్శి రామారావు మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని కార్మికుల పని సమయాల్లో మార్పుచేయాలని, ఎండ తీవ్రత ఉన్న సమయంలో పనులు నిలిపివేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లతోపాటు వాటర్ స్ప్రేయింగ్ చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు యెర్రభట్టి విక్రమార్క, క్రాంతికుమార్, యర్ర భాస్కర్, నాగ ప్రకాష్, చెన్నకేశవ, కోటిరెడ్డి అశోక్, నాగేందర్, మున్వర్ ఖాన్, అప్సర్‌పాషా, సురేష్, నాగార్జున, లింగమూర్తి, సత్యనారాయణ, కిషన్, భద్రు, ఆవుల శ్రీను, ఉద్యోగస్తులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మణుగూరువాసి ప్రతిభ



మణుగూరు, ఏప్రిల్ 13: మణుగూరుకు చెందిన అథ్లెటిక్ క్రీడాకారుడు జల్లా రవీందర్ తన ప్రతిభను చూపి మాస్టర్ అథ్లెటిక్ పోటీల్లో రెండు మెడల్స్ సాధించాడు. శనివారం సికింద్రబాద్‌లోని హెల్తీ సినియర్ సిటిజెన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రైల్వే స్పోర్ట్స్ కాంపెక్స్‌లో నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజయాలను కైవసం చేసుకున్నాడు. లాంగ్ జంప్, త్రిపుల్ జంప్ విభాగాల్లో అరవైఏళ్ల కేటగిరిలో రవీందర్ భద్రాద్రి జిల్లా నుంచి పాల్గొని ద్వితియ స్థానంలో నిలచి సిల్వర్ మెడల్స్ సాధించాడు.